క్లుప్తంగా

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,61,800, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.35,720తో మొత్తం రూ.1,97,520 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున విశేషపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా మందిర వార్షికోత్సవం

ఆలమూరు: మండలంలోని మూలస్థానం అగ్రహారంలోని గౌతమీ గోదావరి తీరాన వేంచేసిన షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. మందిర కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి ప్రతిష్ఠ పూజలు

మామిడికుదురు: లూటుకుర్రులో పునర్నిర్మించిన ఆలయంలో పోళ్లమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శనివారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రహ్మశ్రీ బాదంపూడి సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో గోకవరపు గణాధిపతి, లక్ష్మీసరోజ, గోకవరపు పెరుమాళ్ల స్వామి, శ్రీవిద్య దంపతులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మార్జనలు, వాస్తు పూజ తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

గురువులకు పాదపూజ

అంబాజీపేట: గురుసేవా విశిష్ట విమలాంబ వీరవరపు సుబ్బాయమ్మ గురు మాతాజీ వార్షికారాధన కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట శివారు కుమ్మరిపాలెంలో ఆదుర్తి నారాయణమూర్తి, సుజాత దంపతుల ఆధ్వర్యంలో 35 మంది గురువులకు పాద పూజను శనివారం చేశారు. విశాఖపట్నం, పైడికొండ గ్రామంలో ఉన్న శివరామ దీక్షితుల పీఠంలో చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతనలోనే ఉంటూ రాష్ట్ర నలుమూలల పర్యటించి ఎంతో మంది శిష్యులను, భక్తులను సంపాదించుకున్నారని అమ్మగారి కుటుంబ సభ్యులు, శిష్యబృందం తెలిపారు. గురువులు కొప్పిశెట్టి మంగతాయారు, గట్టెం సత్యనారాయణ, తాడి సూరిబాబు, తాతారావు, కాకి గోపాలకృష్ణ, కోలా అప్పారావు, వీసు ఆదినారాయణ గురువులను ఘనంగా సత్కరించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కొత్తపేట: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక ఎస్సై జి.సురేంద్ర అన్నారు. భాష్యం విద్యార్థుల జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ఆ సంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. సభలో స్థానిక ఎస్సై, వైద్యుడు సత్యవరపు విశ్వనాథగాంధీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి విద్యతో పాటు ఆటలు ఆడితే శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం ఎస్సై క్రీడలను ప్రారంభించి, క్రీడా జ్యోతిని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్ జేవీ శ్రీనివాస్, స్థానిక బ్రాంచ్ ప్రిన్సిపాల్ ఎం.లోకేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సొమ్ము రికవరీ

పి.గన్నవరం: ఆర్అండ్‌బీ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి సొమ్ము రికవరీ చేస్తామని ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ జి.వెంకటేశ్వరరావు అన్నారు. రూ.10 కోట్లతో ఏజీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా పి.గన్నవరం సెంటర్ నుంచి పోతవరం వరకూ నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలిస్తున్నామని వివరించారు. అభివృద్ధి పనుల్లో చిన్న, చిన్న లోపాలు ఉంటే సరిచేయిస్తామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ సీసీ రోడ్డును కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావు, ఈఈ జి.శ్రీనివాస నాయక్, డీఈ హరి ప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము, డీఈ జి.రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

గ్లాసుడు నీటి కోసం... బిందెడు పాట్లు

- కుళాయిలు ఉన్నా తాగునీరు లేదు
- అక్రమ మోటార్ల వినియోగమే కారణం
- రామరాజులంకలో జలఘోష



రామరాజులంక మెయిన్‌లో తాగునీటి కోసం మహిళల పాట్లు

మలికిపురం: అది జనసేన బలం అధికంగా ఉన్న గ్రామం. ఈ కారణంగా సుమారు నాలుగేళ్ల క్రితం ఈ గ్రామంలో నేతలంతా ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను గ్రామంలో ప్రతి వీధికీ తిప్పారు. అలాంటి గ్రామంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గత ఆరు నెలలుగా తాగునీటి సమస్య విలయ తాండవం చేస్తుంది. మూడు నెలల క్రితం గ్రామంలోని మహిళలంతా పంచాయతీకి తాళం కూడా వేశారు. దీనికి కారణం గ్రామంలో అక్రమ కుళాయిలు, పైప్‌లైన్లకు మోటార్లు వినియోగమే కారణమని ఆ పార్టీ కార్యకర్తలే బోరుమంటున్నారు. అటు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా రామరాజులంక గ్రామస్తులు దాహంతో అల్లాడుతున్నారు. అసలే వేసవి ప్రారంభమయింది. ఎండలు మండుతుండగా వారికి తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకడం కష్టంగా ఉంది. ఇది మేజర్ పంచాయతీ. గ్రామంలో మొత్తం జనాభా 12 వేల పైబడి ఉంది. ప్రధానంగా రామరాజులంక గ్రామం మెయిన్, పెదతిప్ప వాసుల తాగునీటి కష్టాలు వర్ణనాతీతం. గ్రామంలోని పెదతిప్పలో ఉన్న 40 వేల లీటర్ల ట్యాంకునకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. ఇక్కడ రోజుకు 10 నిమిషాలు కూడా కుళాయిల నుంచి నీరు రావడం లేదు. అది కూడా ఆ కుళాయిల వద్ద ప్రజలు గోతులు తీసుకుని బిందె నింపుకోవాల్సిందే. గ్రామం మెయిన్‌లో లక్షా 62 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు ఉన్నప్పటికీ సుమారు ఆరు వేల జనాభా ఇక్కడే ఉంది. వర్షాకాలంలోనే ఇక్కడ సరిగా నీరుండదు. గత కొంత కాలంగా ఇక్కడ తాగేందుకు కుళాయిల నుంచి గుక్కెడు నీరు కూడా రావడం లేదు. సాయంత్రం వేళ కుళాయి నుంచి నీరొస్తుందంటే బిందెలతో పరుగెడుతుంటారు. నీటి కోసం మహిళలు కుళాయి వద్దకు చేరుకోక ముందే నీరు రావడం ఆగిపోతుంది. ఇదండీ గ్రామంలోని ఊచకాలువ గట్టు ప్రజల దీనస్థితి. పట్టించుకునే నాథుడే ఇక్కడ లేడు. ఇక రామరాజులంక బాడవపరిస్థితి మరీ దారుణం. సుమారు వంద కుటుంబాలు బాడవలోనే నివసిస్తున్నాయి. గ్రామంలో తాగునీటి సమస్యకు ప్రధాన కారణం పంపింగ్ చేసే పైప్‌లైన్‌కు ఈ గ్రామం శివారులో ఉండడంతో పాటు అక్రమ కుళాయిలు.

శివారున ఉండడమే శాపం

ఈ గ్రామంలోని మెయిన్‌లో లక్షా 62 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకునకు గుడిమెళ్లంక ప్రధాన రిజర్వాయర్ నుండి పంపింగ్ జరుగుతుంది. సుమారు 10 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ పైప్ లైన్‌లో మధ్యలో సుమారు నాలుగు గ్రామాల ట్యాంకులు ఉన్నాయి. శివారులో ఈ గ్రామం ఉంది. పైగా శివారుకు వచ్చే సరికి ఒత్తిడి తగ్గి ట్యాంకులోనికి నీరు ఎక్కడం లేదు. దీనికి తోడు అక్రమ కుళాయిలు, వాటికి మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్నారు. ఫలితంగా సాధారణ ప్రజలకు బిందెడు నీరు దొరకడం కష్టం అవుతుంది. ఇదే విషయాన్ని గ్రామస్తులు అధికారులతో పదే పదే చెబుతున్నా స్పందన శూన్యం. ఈ సమస్య పరిష్కారానికి నేరుగా గుడిమెళ్లంక గ్రామం నుంచి రామరాజులంక గ్రామానికి ప్రత్యేక పైపులైన్ వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే అక్రమ కుళాయిలు, మోటార్లు తొలగింపు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బాడవతో పాటు, మెయిన్ ప్రాంతాలలో రెండు అదనపు ట్యాంకులు నిర్మిస్తే కొంత వరకూ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక గ్రామంలోని చర్చిపేటలో 40 వేల లీటర్ల, గండిపేటలో 30 వేలు, ముద్దల వారి మెరకలో 30 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఉన్నా నీరు అందడం లేదు.

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు



తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కారణాలను అధికారులు గుర్తించినా సమస్య పరిష్కారానికి నోచడం లేదు. ప్రతి పంచాయతీ సమావేశంలోనూ ఇదే చర్చ జరుగుతుంది. ఫలితం ఉండడం లేదు.

– నల్లి శివకుమార్, పెదతిప్ప, రామరాజులంక

రాజకీయ ఒత్తిడితో ఇబ్బందులు



గ్రామంలో తాగునీటి సమస్యకు కారణాలను గుర్తించాం. అక్రమ మోటార్లు వినియోగం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. వాటిని తొలగిస్తున్నా, మరలా వేస్తున్నారు. రాజకీయ ఒత్తిడి కూడా ఉండడం వల్ల ఏమీ చేయలేని పరిస్థితి.

– కాకర శ్రీనివాస్, సర్పంచ్

ఉద్యాన సహాయకులకు అవార్డులు



అమలాపురంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మణికంఠ

రావులపాలెం: మండలంలోని గోపాలపురం 1, దేవరపల్లి 1 సచివాలయాల ఉద్యాన సహాయకులు తోరాటి మణికంఠ, కడలి రేణుకారాఘవిలకు ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. 2024–25లో అంకితభావంతో సేవలందించినందుకు శుక్రవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఉద్యాన పంటల సాగు రైతులకు సహాయ సహకారాలు అందించడంలో మణికంఠ, రేణుకారాఘవిలు చేస్తున్న సేవలను కొనియాడారు. వారిని ఆయా సచివాలయాల సహోద్యోగులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధికి సన్మానం



అధికార ప్రతినిధి సత్యనారాయణను సన్మానిస్తున్న పార్టీ నేతలు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన ఈదరాడకు చెందిన గుబ్బల సత్యనారాయణను శనివారం గ్రామంలో జరిగిన సభలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి, కుసుమ శ్రీధర్ దంపతుల చేతుల మీదుగా ఈ సన్మానం జరిగింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సహకారంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కూటమి వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్తామని సత్యనారాయణ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గోసంగి బాపూజీ, గోసంగి రాజేశ్వరి, ముసూడి నరసింహస్వామి, తోట త్రిమూర్తులు, మంద చందనబాబు, బూల సుందరరావు, తోట సూర్యనారాయణ, బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భావిభారత పౌరులుగా ఎదగాలి



అంబాజీపేటలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న స్కౌట్స్ విద్యార్థులు

అంబాజీపేట: సేవాభావం, దేశభక్తి అలవర్చుకుని దేశ సమగ్రతకు మంచి భావిభారత పౌరులుగా ఎదగాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ రూపశిల్పి బెడెన్ పావెల్ జయంతిని, వరల్డ్ థింకింగ్ డేలను పురస్కరించుకుని స్కౌట్స్ విద్యార్థులు శనివారం మార్చ్‌ఫాస్ట్ చేశారు. హెచ్ఎం సాయిరామ్ మాట్లాడుతూ సేవాభావంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్ టీచర్ ఎల్.వెంకటేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోరిలో..

సఖినేటిపల్లి: మండలం మోరి, జాన సుబ్బమ్మ జెడ్పీ హైస్కూల్‌లో భారత్ స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపకుడు పావెల్ జన్మదినం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ కృష్ణ స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని శనివారం ఎగురవేశారు. పావెల్ చిత్రపటానికి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణప్రసాద్ పూలమాల వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రాజేశ్వరి, జి.రాజుబాబు, ఎ.గంగాప్రసాద్, పి.సుమన, బి.సుజాత, ఎం.సత్యనారాయణ మూర్తి, సీహెచ్ దివ్యలక్ష్మి పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు పావెల్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కృత్యాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాసు, ఎస్ఎంసీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, స్కౌట్స్ టీచర్ డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు గుర్తించేందుకు సర్వే



గొల్లపాలెంలో సర్వే నిర్వహిస్తున్న లీగల్ టీమ్, ఏఎన్ఎంలు

మలికిపురం: న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం దివ్యాంగుల సమస్యలు గుర్తించేందుకు డోర్ టు డోర్ సర్వే జరిగింది. గూడపల్లి, గుబ్బలపాలెం, పల్లిపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో దివ్యాంగులను విజిట్ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు, ఇతర సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడారు. ప్యానల్ న్యాయవాది వై.లక్ష్మీసుధా, పారా లీగల్ వలంటీర్ కె.ప్రసాద్, సీహెచ్ పార్వతి, కమ్యూనిటీ హెల్త్ డాక్టర్ చొప్పల పుణ్యవతి, ఏఎన్ఎం కేబీఎల్ కుమారి, వరలక్ష్మి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: దివ్యాంగుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ శనివారం సర్వే చేపట్టారు. రాజోలు కోర్టు కాంప్లెక్స్ పరిధిలో రాజోలు, మలికిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్ల సర్వేలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గల దివ్యాంగుల వివరాలను ప్రత్యేకమైన యాప్‌లో పొందుపరుస్తున్నారు. మోరి, కడలి గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో పానల్ న్యాయవాదులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లతో ఎంతో ఉపయోగం



ఇరుసుమండలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

అంబాజీపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక సామర్థ్యాన్ని వెలికితీసేందుకు, పరిశోధనాత్మక శక్తికి సైన్స్‌ఫేర్‌లు ఎంతో ఉపయోగపడతాయని పంచాయతీ కార్యదర్శి రావి ఏడుకొండలు చంటి, పీటీఏ బులుసు శ్రీనివాస్ అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ సిస్టర్ రెని అధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పోను శనివారం నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ గొప్పతనం, వాటి విలువలు, అద్భుతాలను విద్యార్థుల కళ్లకు కట్టినట్లు విశదీకరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీమోల్, సిస్టర్ అభిష, డాక్టర్ డి.కుమార్ మణిప్రకాష్, ఆర్.ప్రసాద్, ఎస్.సత్యానందరావు, భీమశంకరం, శాంతిరాజు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే మంచి ఫలితాలు

రాజోలు: విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని రాజోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలు ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులు చేస్తున్న కృషిని అభినందించారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఆర్ఎల్ఎం శిక్షణ

రాజోలు: డ్వాక్రా సంఘాల సభ్యులు, సీసీ, వీఓఏలకు నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. స్థానిక రాజోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, పి.గన్నవరం మండలాలకు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యులకు పలు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. జిల్లా టీఓటీలు వరాలబాబు, జి.దుర్గప్రసాద్ శిక్షణ ఇచ్చారు. డీపీఎం ఎ.గణేష్, ఏపీఎం భూపతివర్మ, సీసీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



శిక్షణ తరగతులనుద్దేశించి మాట్లాడుతున్న సీఎంఓ



జ్ఞానజ్యోతి కార్యక్రమంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు తదితరులు

మలికిపురం: అంగన్‌వాడీ సిబ్బంది నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని బట్టేలంకలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక రిసోర్స్ పర్సన్లతో జరుగుతున్న శిక్షణ తరగతులను శనివారం ఆయన సందర్శించారు. తరగతులనుద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు ఈ తరగతులను సద్వినియోగం చేసుకుని పూర్తి అవగాహన పెంచుకుని ఆయా కేంద్రాల చిన్నారులను విద్యాపరంగా తీర్చిదిద్దాలని, దీని కోసమే ప్రభుత్వం ఈ తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఎంఈఓలు ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు హైమావతి పాల్గొన్నారు.

మామిడికుదురు: బాల్యంలో నేర్పించిన విద్య ద్వారానే విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారని సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ల జ్ఞానజ్యోతి రెండో విడత శిక్షణ తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న బాలలను ఆకట్టుకునే విధంగా బోధన జరగాలన్నారు. నూతన పద్ధతుల ద్వారా చిన్నారులకు ఆకళింపు చేయడం ఎలా అన్న అంశంపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న విధంగానే బాలలకు బోధన చేయాలని సుబ్రహ్మణ్యం దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, హెచ్ఎం సీహెచ్ నిరంజని, వెన్యూ ఇంచార్జ్ టి.వెంకటేశ్వరరావు, వై.పల్లంరాజు, ఎంఎస్ మునేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.విజయలత, బి.అన్నపూర్ణ, ఎస్.సుబ్బలక్ష్మి, డీఆర్పీలుగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు.

'జ్ఞానజ్యోతి'లో పుట్టినరోజు వేడుకలు

అయినవిల్లి: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లతో చిన్నారులకు పుట్టినరోజు వేడుకల కృత్యాలు ఎలా నిర్వహించాలో శనివారం రిసోర్సు పర్సన్ ఆధ్వర్యంలో శిక్షణ ద్వారా వివరించారు. అంగన్‌వాడీ టీచర్లలో పి.వరలక్ష్మికి చిన్నారులకు ఎలా పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారో అలాగే నిర్వహించారు. ఆమెతో అంగన్‌వాడీ టీచర్లకు తలపై రంగురంగుల టోపీలు ధరింపచేశారు. కేకు కట్ చేసి వేడుకలు జరిపారు. అక్కడున్న వారితో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్లు, బిస్కట్లు పంచారు. ఈ వేడుకల్లో ఎంఈఓ పి. శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్స్ పసుపులేటి శ్రీనివాస్, బీర సందీప్, పల్లంరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



పాశర్లపూడిబాడవలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం మామిడికుదురు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాశర్లపూడిబాడవ, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలసి రాజశేఖర్‌కు అండగా నిలవాలని కోరారు. నగరం సాయిదీప్తి స్కూల్లో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో ఎమ్మెల్సీ దుర్వాసపు రామారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

బీజేపీ మండల సమావేశం

మలికిపురం: మండల బీజేపీ సమావేశం గూడపల్లిలో కాపిశెట్టి కనకేశ్వరరావు ఇంటి వద్ద మండల పార్టీ అధ్యక్షులు మేడిచర్ల చాణిక్య అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించాలని కోరారు. మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన జిల్లా అధ్యక్షులుగా నియమించిన అడబాల సత్యనారాయణ, మానేపల్లి అయ్యాజీవేమా, పార్టీ కార్యాలయాలకు వితరణ చేసిన స్థల దాతలు దొడ్డ నాగబాబు, చంపాటి శివ రామకృష్ణరాజులకు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణమ్మ కుటుంబానికి పరామర్శ



మాచవరంలో పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: మాచవరంలో ఇటీవల మృతి చెందిన బొర్రా సత్యనారాయణమ్మ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. సత్యనారాయణమ్మ కుమారులు, పార్టీ నాయకుడు బొర్రా రమేష్‌తో పాటు అతని సోదరులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. సత్యనారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల కన్వీనర్ విత్తనాల ఇంద్రశేఖర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీనివాస్, మట్టపర్తి హరి, అప్పన శ్రీనివాస్, బీర సురేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

అయినవిల్లి: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీపై గ్రామస్తులకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు స్థానిక ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహర తెలిపారు. చింతనలంకలో ఈఓపీఆర్డీ శనివారం ఇంటింటికీ వెళ్లి పొడి చెత్త, తడి చెత్త వేరుచేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని అవగాహన కల్పించారు. అందుకోసం గతంలో రెండు ప్లాస్టిక్ బుట్టలను పంచాయతీ సిబ్బంది పంపిణీ చేసినట్లు గ్రామస్తులకు ఆమె గుర్తు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతొందన్నారు. తద్వారా గ్రామంలో కొందరికి ఉపాధి కల్పించడంతో పాటు, గ్రామంలో ప్రజల ఆరోగ్యం కాపాడవచ్చన్నారు. గ్రామస్తులకు సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీను, గ్రీన్ అంబాసిడర్స్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

మలికిపురం: విశ్వేశ్వరాయపురం నుంచి సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామం శివారు చింతలమోరి సరిహద్దు వరకు గల రెండున్నర కిలో మీటర్ల పరిధిలో కత్తిమండ డ్రైన్ పూడికతీత మట్టిని దొంగిలించుకుపోయారు. సుమారు రూ.47 లక్షలతో డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఈ పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఈ పూడికతీత మట్టిని శ్మశానాలు కప్పుతామని చెప్పి, కొంతవరకు కప్పడం జరిగిందని సామాజిక కార్యకర్తలు యెనుముల వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, ముత్యాల శ్రీనివాసరావు, చెవ్వాకుల వెంకట్ తదితరులు పేర్కొన్నారు. మట్టి దొంగిలించుకుపోయిన ప్రాంతాన్ని శనివారం ఈ బృందం పరిశీలించింది. శ్మశానవాటిక మెరక పనుల వంకతో ప్రైవేటు వ్యక్తుల భూముల్లో పూడిక చేయడం కోసం మురుగుకాలువ మట్టిని ఇష్టానుసారంగా తరలించారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరపాలని ఈ బృందం అధికారులను కోరింది.

కవలలు అభినందనీయులు

అంబాజీపేట: ఒకేసారి జన్మించిన కవలల అభిరుచులు, అభిప్రాయాలు, ఆలోచనలు ఒకేలా ఉండటం అభినందనీయమని హెచ్ఎం పీవీ.కేశవాచార్యులు అన్నారు. అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తొండవరం జెడ్పీ హైస్కూలులో కవలలకు అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ ట్విన్స్ ఎప్పుడు కలసి మెలసి ఉండి మరొకరికి ఆదర్శంగా ఉండాలన్నారు. ట్విన్స్‌గా జన్మించడం దేవుడిచ్చిన వరమని తక్కువ మందికి మాత్రమే ఈ అవకాశం వస్తుందన్నారు. కవలల దినోత్సవం సందర్భంగా పదో తరగతి చదువుతున్న బొంతు రామదుర్గ, లక్ష్మణ్, 9వ తరగతి చదువుతున్న పేరాబత్తుల మధు, సిరి, పుగాకు వేణు హర్షిత, వేణు పూజిత, ఏడో తరగతి చదువుచున్న అరిగెల రామలక్ష్మి, లక్ష్మణ్‌కుమార్‌లను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ట్విన్స్ విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ మట్టపర్తి రాంబాబు, మానుకొండ చంద్రరావు, ఏవీ అప్పారావు, పాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సులు

పి.గన్నవరం: క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల సందర్భంగా నరేంద్రపురంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు పి.గన్నవరం టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సా విధానం, దీనికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ శివారు పోలంపేటలో కూడా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ జి.సర్వారాయుడు, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఏ బి.రాజారావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ పున్నం వేణు తదితరులు ఉన్నారు.

కాశీ మృతికి సంతాపం

కొత్తపేట: రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ (ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ తండ్రి) మృతి పట్ల పూర్వ, ప్రస్తుత పీడీలు, పీఈటీలు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని వాడపాలెంలో పుట్టి పెరిగిన కాశీకి మండలంతో మంచి అనుబంధం ఉంది. బంధుత్వాలతో, అనేక మంది స్నేహితులతో, క్రీడాకారులతో ఆయనకు పరిచయాలున్నాయి. అటువంటి కాశీ మృతికి రిటైర్డ్ పీఈటీ, ఎన్‌సీసీ ఆఫీసర్ నల్లా సత్యనారాయణమూర్తి (నల్లా మాస్టర్), రిటైర్డ్ పీఈటీలు మారిశెట్టి సత్యనారాయణ, యర్రంశెట్టి చినరామన్న, పీడీలు, పీఈటీలు సంతాపం ప్రకటించారు.